## ఆన్‌లైన్‌లో వినతి

# అందిన కొలువు

తిరునెల్వేలి, న్యూస్‌టుడే

**దూరవిద్య ద్వారా పీజీ చేసింది. ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకుంది. అన్ని అర్హతలున్నా ఆమెను ఎంపిక చేయలేదు. పట్టువదలని ఆ యువతి ఆన్‌లైన్ ద్వారా ఉప ముఖ్యమంత్రికి వినతి పంపి కొలువు దక్కించుకుంది.**

తిరునెల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగ ఖాళీ భర్తీకి ఇటీవల ప్రకటన విడుదల చేశారు. అరుంధతీయ సామాజికవర్గానికి కేటాయించిన ఈ పోస్టుకు నీలగిరి జిల్లా కున్నూరులోని ఓ వీధిలో పండ్ల దుకాణం నిర్వహించే పత్తురన్, తులసి దంపతుల కుమార్తె రాధ దరఖాస్తు చేసుకున్నారు. ఆమె ఒక్కరి దరఖాస్తే అధికారులకు అందింది. ఇంతలో సరైన అర్హత కలిగిన అరుంధతీయ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థి లేకపోతే ఆ ఉద్యోగాన్ని ఇతర ఆదిద్రావిడులకు కేటాయిస్తామని విశ్వవిద్యాలయ వర్గాలు చేసిన ప్రకటన ఆమెను కలకలానికి గురి చేసింది. దీంతో www.mkstalin.net వెబ్‌సైట్ ద్వారా ఉప ముఖ్యమంత్రి స్టాలిన్‌కు పరిస్థితిని వివరించింది. గతంలో విశ్వవిద్యాలయం ఇదే పోస్టుకు నిర్వహించిన ఇంటర్వ్యూకు అరుంధతీయ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులు రాకపోవడంతో రెండోసారి ప్రకటన ఇచ్చారని తెలిపారు. ఉద్యోగానికి కావాల్సిన అర్హతలు ఉన్నాయని, ఏదైనా కారణంతో తనను అనర్హురాలిగా ప్రకటిస్తే అది అరుంధతీయేతరులకు దక్కుతుందని పేర్కొన్నారు. ఆ ఉద్యోగ ఖాళీకి తనను సిఫారసు చేయాలని కోరారు. స్పందించిన స్టాలిన్ అరుంధతీయులకు కేటాయించిన ఉద్యోగ ఖాళీలను వేరే విధంగా భర్తీ చేయకూడదని, అన్ని అర్హతలున్న రాధని ఆ పోస్టులో నియమించాలని ఉన్నత విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇంటర్వ్యూ ద్వారా ఆమెకు నియామక ఉత్తర్వులు అందాయి.